www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 28 అక్టోబర్ 2023
5
అన్నమయ్య



ఉర్దూ కళాశాలలో డిఐఒ తనిఖీ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఇంటర్మీడియట్ జిల్లా విద్యాశాఖ అధికారి కృష్ణయ్య శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ ఉర్దూ కళాశాలను ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. కళాశాలలో ఉన్న రికార్డులను పరిశీలించారు. కళాశాలలో ఉన్న సిబ్బందిని, వారి పనితీరును పరిశీలించి ఈ ఏడాది ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. ఇప్పటి నుంచే ప్రత్యేక తరగతులు తీసుకొని విద్యార్థులకు మంచి విద్యనందించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ అజయ్‌బాబు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న డిఐఒ కృష్ణయ్య

చినుకు లేక..చింత!

- వర్షాభావంతో ఎండుతున్న వేరుశనగ
- కాపాడుకునేందుకు రైతుల అవస్థలు
- ట్యాంకర్లతో నీటి సరఫరా..రూ.వేలల్లో వ్యయం



వర్షాభావంతో ఎండిపోయిన వేరుశనగ పంట

ప్రజాశక్తి-కలికిరి

వర్షాధారంగా సాగు చేసిన మెట్ట పంటలను వర్షం దెబ్బ తీసింది. సకాలంలో వానల్లేక వేసిన పంటలు చేతికి అందివస్తాయో లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. అరకొరగా వర్షాలు కురవడం, ఆ తర్వాత ఖరీఫ్ సీజన్లో వర్షాధారంగా మెట్ట భూముల్లో వేరుశనగ సాగు చేసిన రైతాంగానికి లోటు వర్షపాతం తీరని నష్టాన్ని మిగిల్చింది. అదునులో పదును వాన కురవక పంటల సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. మండల పరిధిలో వేరుశనగ సాధారణ సాగు విస్తీర్ణం 250 నుంచి 300 హెక్టార్లు కాగా ఈ ఖరీఫ్‌లో సగానికి సగం మాత్రమే సాగింది. సాధారణ సాగులో 20 శాతం పంట మాత్రమే రైతులు సాగు చేయడానికి ఆశక్తి చూపడం లేదు. నాలుగైదు సంవత్సరాలుగా రైతులు వేరుశనగ పంట వేయడానికి నిరాశక్తి వ్యక్తం చేస్తున్నారు. వేసిన పంటలకు కూడా ఆరకొరా వర్షానికి ఎండుతూ పండిన పంట దిగుబడి పడిపోవడంతో పాటు వర్షం కురవక రైతులు ట్యాంకర్లతో నీటిని పిచికారి చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. సకాలంలో వర్షాలు కురువకపోవడంతో వంద రోజుల్లో నూర్పిడి చేయాల్సిన వేరుశనగ 140 రోజులు దాటినా చేతికి అందక పోవడం, ట్యాంకర్లతో నీటిని తోలి పంటను నూర్పిడి చేస్తున్నారు. ఇలా చేయడంతో ఎకరానికి నాలుగైదు వేలు అదనంగా ఖర్చు చేయాల్సి వస్తుందని రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తీవ్ర వర్షాభావంతో అరకొరక పండిన పంట నూర్పిడికి రైతులకు తిప్పలు తప్పడం లేదు. చేతికొచ్చిన పంటను సకాలంలో నూర్పిడి చేయడానికి పదును వాన కరువైంది. ఎండిపోతున్న వేరుశనగ మొక్కలను తీయడానికి రైతులు ట్యాంకర్లతో నీటిని పిచికారి చేస్తున్నారు ట్యాంకర్లతో నీటి తడి అందించడానికి ఎకరానికి 6 నుంచి 7 ట్యాంకర్లు నీరు అవసరమని రైతులు వాపోతున్నారు. అంతంత మాత్రంగా పండిన పంట నూర్పిడికి అదనంగా నాలుగైదు వేలు ఖర్చు చేయాల్సి వస్తుందని, ట్యాంకర్లతో నీటిని పిచికారి చేయడంతో అంతర పంటలు దెబ్బతిని అతను ఆదాయం కూడా కోల్పోవాల్సి వస్తుందని, ఎకరాని ఐదు బస్తాలు లోపే దిగుబడి రావడంతో పెట్టుబడి ఖర్చులు కూడా చేతికి రావడం లేదని రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎండిపోతున్న పంటలు రైతులను ఆవేదనకు గురి చేస్తున్నాయి. తీవ్ర వర్షాభావ పరిస్థితులు రైతన్నకు కన్నీరు తెప్పిస్తున్నాయి. ఈ ఏడాది ఖరీఫ్ మొదలైనప్పటి నుంచి అరకొరగానే వానలు కురిశాయి. ఈ వర్షాలకే రైతులు వివిధ రకాల పంటలు సాగు చేశారు. అడపాదడపా కురిసిన వర్షంతో పంటలు ఒక దశ వరకు వచ్చాయి. ఆ తర్వాత వర్షం పూర్తిగా ముఖం చాటేశాడు. చేతికి వచ్చే దశలో ఉన్న పంటలను కాపాడుకోవడానికి రైతుల అవస్థలు అన్నీ ఇన్నీ కావు. వేల రూపాయలు ఖర్చు చేసి ట్యాంకర్లతో నీరు పెట్టి పంటలను రక్షించుకునేందుకు భగీరథ ప్రయత్నం చేస్తున్నారు.

నష్టాలు పాలు అవుతున్నాం



వేరుశనగ పంట సాగు చేస్తుండటంతో అధికంగా నష్టాలు పాలవుతున్నాం. వర్షాలు సకాలంలో పడకపోవడంతో దిగుబడి భారీగా తగ్గింది. సకాలంలో వర్షాలు కురువకపోవడం వలన వేరుశనగ కాయలు నాణ్యత లోపించింది. కొనుగోలుదారుల ఆసక్తి చూడడం లేదు.

- ఎస్.కరుణాకర్, రైతు, గుట్టపాలెం, కలికిరి.

పంట సాగుకు ధైర్యం చాలడం లేదు



ఒకటిన్నర ఎకరా విస్తీర్ణంలో వేరుశనగ సాగుకు రూ.30 వేలు ఖర్చయింది. వర్షాలు లేక మొక్కుకు ఐదారు కాయలే కాస్తున్నాయి. ఎకరానికి ఐదు బస్తాలు దిగుబడి వచ్చే పరిస్థితి లేదు. పంట నూర్పిడికి ట్యాంకర్లతో నీరు పిచికారి చేయాల్సి వస్తుంది. అదనంగా ఖర్చు వస్తోంది. ప్రభుత్వం ఆదుకోవాలి.

- సురేందర్‌రెడ్డి, రైతు, కలికిరి.



వేరుశనగ పంట నూర్పిడికి ట్యాంకర్‌తో నీరు పడుతున్న రైతు

మంగంపేట నిర్వాసితులకు పూర్తి సహకారం : కలెక్టర్

ప్రజాశక్తి-ఓబులువారిపల్లి

మంగంపేట ముంపు బాధితులకు కేటాయించిన అర్అర్-5 లేఅవుట్ అత్యంత సుందరంగా తీర్చిదిద్దుతామని కలెక్టర్ గిరిష తెలిపారు. శుక్రవారం మండలంలోని మంగంపేట గ్రామ పంచాయతీ కాపువల్లి ముంపు బాధితులకు కేటాయించిన ఆర్‌ఆర్-5, లే అవుట్‌ను రైల్వేకోడూరు ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులుతో కలిసి కలెక్టర్ గిరిష క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మంగపేట ముంపు బాధితులకు ప్రభుత్వ పరంగా పూర్తి సహాయ సహకారాలు అందించి ఆదుకుంటామన్నారు. మంగంపేట గ్రామ పంచాయతీ కాపువల్లి, అరుందతివాడ మరియు హరిజనవాడ గ్రామాలలో గ్రామస్తుల కోరిక మేరకు లేఅవుట్లో అన్ని మౌలిక వసతులు కల్పించి సుందరంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఈ లేఅవుట్‌లో సిసి రోడ్డు, డ్రెయినేజీ, స్కూల్ బిల్డింగ్, ఎలెక్ట్రికల్, ప్లే గ్రౌండ్, శ్మశనవాటికి, పార్క్ తదితర మౌలిక వసతులన్నీ లేఅవుట్‌లో కల్పిస్తున్నామన్నారు. ప్రస్తుతం రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయని నెల రోజులలో రోడ్డు పనులు పూర్తి చేసి వాటర్ సప్లై ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇక్కడ నిర్మించే ప్రతి ఇంటికి అండర్ గ్రౌండ్ కరెంటు సదుపాయం కల్పిస్తామన్నారు. కాలనీలో విశాలమైన రోడ్లు, రోడ్డు కిరు వైపులా గ్రీనరీ ఏర్పాటు చేసి పచ్చదనాన్ని పెంపొందిస్తామని చెప్పారు. ఆర్చి నిర్మాణం ఆకర్షణీయంగా ఉండాలని పంచాయతీరాజ్ అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మంగంపేటను స్పెషల్ కేస్ కింద తీసుకోవడం జరిగిందని ఈ కాలనీని ఒక మోడల్ సిటీగా తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. ఆర్‌అండ్‌ఆర్ 5 లే అవుట్‌లో ప్రత్యేక వసతులతో కూడిన పార్కు నిర్మాణం చేపడతామన్నారు. కాపువల్లిని ఆహ్లాదకరమైన వాతావరణం కలిగి సురక్షితమైన ప్రాంతాలకు తరలించడం ప్రతి ఒక్కరూ గమనించదగ్గ విషయమన్నారు. ఈ లేఅవుట్ నిర్మాణానికి సంబంచి ఎటువంటి సమస్యలున్నా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం కలెక్టర్ వివిధ అంశాలపై మంగపేట నిర్వాసితులతో సుదీరంగా చర్చించి అధికారులకు తగు సూచనలు సలహాలు ఇచ్చారు. ఎమ్మెల్యే శ్రీనివాసులు మాట్లాడుతూ మంగంపేట నిర్వాసితులకు ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి మంగంపేట నిర్వాసితులను అన్ని విధాలుగా ఆదుకునేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టడం జరుగుతోందన్నారు. మంచి ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆర్‌అండ్‌ఆర్ 5 లేఔట్ నిర్మించడం ఎంతో శుభ పరిణామమన్నారు. ఈ అవుట్‌లో ప్రజలకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించడం అవుతుందని ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్ రెడ్డి, తహశీల్దార్ పుల్లారెడ్డి, సర్వేయర్, ఎపిఎస్‌పిడిసిఎల్, పంచాయతీరాజ్, ఆర్డబ్ల్యూఎస్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



నిర్వాసితుల కాలనీలో రోడ్డు పనులను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలి : విద్యార్థి సంఘాలు



నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పట్టణంలో సాయినగర్‌లో ఉన్న రంగయ్య నవోదయ, సైనిక్ కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్ఐ, పిడిఎస్‌యు విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కోచింగ్ సెంటర్లపై చర్యలు చేపట్టాలని కోరుతూ శుక్రవారం మండల విద్యాశాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీరామ్ పురుషోత్తం చిట్వేలి మండలంలోని జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి వచ్చిన సందర్భంగా వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎటువంటి అనుమతులు లేకుండా నవోదయ, సైనిక్, ఆర్ఎంఎస్ పేరుతో లక్షల రూపాయలు వసూలు చేస్తూ విద్యార్థులకు ఎటువంటి వసతులు కల్పించకుండా ఒక ఇంటి గదిలోని హాలులో దాదాపు 70 నుండి 100 మంది విద్యార్థులను కిక్కిరిసేలా కూర్చోబెట్టి దాదాపు 30 సంవత్సరాల నుండి అనుమతులు లేకుండా కోచింగ్ సెంటర్ నడుపుతున్నారని పేర్కొన్నారు. విద్యార్థులకు కనీస సౌకర్యాలు కూడా అందించకుండా ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను కోచింగ్ సెంటర్‌లో చేర్చుకున్నారని, వారి అడ్మిషన్లు, హాజరు ఎక్కడన్నాయో తెలపాలన్నారు. ఎటువంటి ఫ్యాకల్టీ లేకుండా, కనీసం ప్రత్యేక బిల్డింగ్ లేకుండా, ఎమర్జెన్సీ సేఫ్టీ పరికరాలను కూడా ఉపయోగించకుండా కోచింగ్ ఇస్తున్నారని పేర్కొన్నారు. విద్యా వ్యాపారాన్ని అరికట్టాలని, అలా విద్యను వ్యాపారంగా చేస్తున్న వారిపై తక్షణమే జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీరామ్ పురుషోత్తం స్పందించి కోచింగ్ సెంటర్‌పై చర్యలు తీసుకొని వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా రంగయ్య అనే వ్యక్తి విద్యార్థులను హాస్టల్ అనుమాతులు లేకుండా ఒకే ఇంట్లో హాస్టల్ నిర్వహిస్తున్నాడని ఆరోపించారు. కోచింగ్ సెంటర్ పై చర్యలు తీసుకోని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్ఐ నాయకులు గౌరీశంకర్, చంగయ్య, సుమంత్, పిడిఎస్‌యు నాయకులు హరి తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డిఇఒ, జెవివి నాయకులు

విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని కలిగించాలి : డిఇఒ

ప్రజాశక్తి-రాయచోటి

జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చెకుముకి సైన్స్ సంబరాలలో విద్యార్థులు పాల్గొనేటట్లు వారిని ప్రోత్సహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీరామ్ పురుషోత్తం అన్నారు. శుక్రవారం డిఇఒ కార్యాలయంలో చెకుముకి సైన్స్ సంబరాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాలలోని 8, 9, 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించి వారిలో శాస్త్రీయ ఆలోచన దృక్పథాన్ని పెంపొందించాలని తెలియజేశారు. జనవిజ్ఞాన వేదిక, చెకుముకి జిల్లా కన్వీనర్ ఆంజనేయులు మాట్లాడుతూ 33 సంవత్సరాలుగా చెకుముకి సైన్స్ సంబరాలను నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. పాఠశాల స్థాయిలో నవంబర్ 10న, మండల స్థాయిలో నవంబర్ 30న, జిల్లా స్థాయిలో డిసెంబర్ 17న, రాష్ట్ర స్థాయిలో జనవరి 27, 28వ తేదీలలో చెకుముకి సైన్స్ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పరీక్షలో సైన్స్, గణితం, జనరల్ నాలెడ్జ్ కు సంబంధించిన 40 ప్రశ్నలు ఉంటాయని తెలిపారు. ఈ పరీక్ష పిల్లల్లో సైన్స్ పట్ల అభిరుచిని పెంపొం దిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్‌రెడ్డి, ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర నాయకులు శ్రీనివాసరాజు, జనవిజ్ఞాన వేదిక నాయకులు ప్రకాష్‌రెడ్డి, కరుణాకర్, బాబా ఫక్రుద్దీన్, నాగరాజు, రాంప్రసాద్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

నేటి సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైమ్ అధికారి సయ్యద్ హుస్సేన్ తెలియజేశారు. శుక్రవారం విజయ భారతి ఇంగ్లీష్ మీడియం హైస్కూలులో పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎన్ సేతు ఆద్వర్యంలో విధ్యార్థులకు అవగాహణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సయ్యద్ హుస్సేన్ మాట్లాడుతూ గతంలో చోరీలు దోపిడీలు జరిగేవని అయితే అవి ఎప్పుడో ఒకసారి జరిగేవని అయితే ఇప్పుడు ప్రతి నిమిషం ఏదో ఒక చోట మనకు తెలియకుండానే మన డబ్బు సైబర్ క్రైమ్ ద్వారా చోరీ చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రస్తుత సమాజంలో సెల్ ఫోన్లు అందరికీ అత్యవసరంగా మారిపొయ్యాయని వాటిలో మనం ఉపయోగించే వాట్సప్, ఫేస్బుక్, ఇన్‌స్టాగ్రామ్, టెలిగ్రామ్ తదితర అప్లికేషన్ల ద్వారా మన ద్వారా మన పూర్తి సమాచారం రాబట్టి మన సొమ్మును లూటీ చేస్తున్నారని మనం కనీస జాగ్రత్తలు తీసుకుంటే అటువంటి వారి బారినుండీ తప్పించుకోవచ్చని తెలియజేశారు. అవసరమైనంత వరకే సోషల్ మీడియాను ఉపయోగించుకోవాలని అనవసర లింకులకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సిఐ మహబూబ్ బాషా, ఎంఇఒ రాజగోపాల్, చల్లపల్లి నరసింహా రెడ్డి, రామ్మూర్తి, అజయ్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సైబర్ క్రైమ్ అధికారి సయ్యద్ హుస్సేన్

ఇజ్రాయిల్ దాడులకు నిరసనగా ర్యాలీ

ప్రజాశక్తి-పీలేరు

పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ దురాక్రమణ, దాడులకు నిరసనగా పీలేరు ముస్లిం మైనార్టీ జెఎసి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం జెఎసి సభ్యులు స్థానిక జెండమాను నుంచి గాంధీ సర్కిల్ వరకు శాంతియుత నిరసన ర్యాలీ నిర్వహించారు. నిరాశ్రయులైన ఇజ్రాయిల్ పౌరులకు మానవతా దృక్పథంతో ఆశ్రయం ఇచ్చిన పాలస్తీయునులపై ఇజ్రాయిల్ అవలంభిస్తున్న తీరును తప్పు పట్టారు. తదనంతరం పాలస్తీయునుల కొరకు నాలుగు రోడ్ల కూడలిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశ్రయం ఇచ్చిన పాలిస్తీన్ గాజాలో మారణ హోమం సృష్టిస్తూ వేల మంది చిన్నపిల్లలను చంపుతున్న ఇజ్రాయిల్‌ను దైవమే శిక్షించాలని తెలిపారు. దేశ ప్రధాని మోడీ జోక్యం చేసుకుని శాంతిని నెలకొల్పేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పీలేరు మసీదుల ముత్తవల్లీలు, ఇమాములు, ముస్లిం యువత, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, మాల మహానాడు సభ్యులు పాల్గొన్నారు.



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లిములు

స్పందన అర్జీలకు సత్వర పరిష్కారం : గిరీష

ప్రజాశక్తి-చిట్వేలి

జగనన్నకు చెబుదాం స్పందన అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలని కలెక్టర్ గిరీష అధికారులకు సూచించారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జగనన్నకు చెబుదాం మండల స్థాయి స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలోకలెక్టర్ గిరీష, జాయింట్ కలెక్టర్ పర్మాన్ అహ్మద ఖాన్, ఆర్‌డిఒ రామకృష్ణారెడ్డి ప్రజల నుంచి స్పందన అర్జీలు స్వీకరించారు. రైల్వే కోడూరు ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, ఎపి స్కిల్ డెవలప్మెంట్ చైర్మన్ కొండూరు అజయ్‌రెడ్డి, ఎంపిపి శ్రీనివాసులురెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. చిట్వేలి మండలంలో చాలావరకు భూ సమస్యలు ఉన్నాయని ప్రజలందరూ తమ సమస్యలను అర్జీ రూపంలో తెలియజేసి వెంటనే పరిష్కరించుకోవచ్చునన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రజల సమస్యలు మండల స్థాయిలోనే పరిష్కరించాలనే ఉద్దేశంతో జగనన్నకు చెబుదాం మండల స్థాయి స్పందన కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. ఇకనుంచి ప్రజలు ఎన్నో వ్యయ ప్రయాసల కోర్చి తమ సమస్యల పరిష్కారం కోసం జిల్లా కేంద్రానికి రాకుండా మండల స్థాయిలోనే సమస్యలు పరిష్కరించుకోవచ్చునన్నారు. అధికారులు స్పందన అర్జీల పై ప్రత్యేక దృష్టి సాధించి బాధితుల సమస్యలు వెంటనే పరిష్కరించాలన్నారు. అర్జీదారులను పదేపదే కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా వారికి అర్థమయ్యే విధంగా ఎండార్స్మెంట్ ఇవ్వాలన్నారు. ప్రతి బుధ, శుక్రవారం రెండు రోజులు ఒక్కొక్క మండల కేంద్రంలో జగనన్నకు చెబుదాం మండల స్థాయి స్పందన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతోందని ప్రజలందరూ స్పందన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కొరముట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రతి పథకం అర్హులకు అందాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన ఉద్దేశ్యమని అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకొని లబ్ధి పొందాలన్నారు. ఏ కారణం చేతనైనా ప్రభుత్వ పథకాలు అందని వారు ఉన్నట్లయితే వెంటనే స్పందన కార్యక్రమంలో అర్జీలు సమర్పించాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ శిరీష, చిట్వేలి సర్పంచ్ దండు లక్ష్మి, ఉప సర్పంచ్ ఉమామహేశ్వర్‌రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, మండల అధికారులు, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



బాధితుల నుంచి సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్, ఎమ్మెల్యే

నిండుగా నీరు.. మిగిలింది కన్నీరు

- వృథా అవుతున్న వజ్రాల వంక నీరు
- బీడుగా మారిన వందలాది ఎకరాల వ్యవసాయ భూములు

ప్రజాశక్తి-పీలేరు

అది ఓ తీవ్ర కరువుగాలం. ప్రజలకు తినడానికి తిండి లేదు. పశువులకు మేత కూడా కష్టమైంది. జనం తమ కడుపు నింపుకోడానికి, పశువుల ఆకలి తీర్చడానికి వలస పోయే పరిస్థితులు. అలాంటి సందర్భంలో వజ్రాల వంకపై కట్ట నిర్మాణం పనులను అప్పటి ప్రభుత్వం చేపట్టింది. కె.వి.పల్లి మండలంలోని గర్నిమిట్ట, చీనేపల్లి, తువ్వపల్లి పంచాయతీ పరిధుల్లోని అనేక పల్లెల ప్రజలకు ఉపాధి అవకాశం కల్పించింది. ఎందరో నిరుపేదలు, పేదలకు కడుపుకంత బువ్వందించింది. మూడేళ్ళపాటు అక్కడి ప్రజలకు బతుకు తెరువునిచ్చి కరువు కాటకాల నుంచి ఆదుకుంది. ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తైన తరువాత ఏర్పడిన అనావృష్టి కారణాల వల్ల అందులోకి ఆశించిని మేరకు నీరు చేరక పోయినా, ప్రజల, పశువుల కనీస అవసరాలు తీరేవి. ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తై, డ్యాంలోకి సమృద్ధిగా నీరు చేరాయి. కుడి కాలువ ద్వారా సుమారు మూడు కిలోమీటర్ల దూరం మేరకు సాగు నీరు అందించింది. ఆ దారిలోని చవటకుంట, రంగారెడ్డి కుంటలకు కూడా సమృద్ధిగా నీటిని అందించింది. వేయి ఎకరాలకుపైగా భూములు సాగులోకి వచ్చేవి. ఎడమ కాలువ నీటి ద్వారా మల్లారపువాండ్లపల్లి, కిచ్చిలివారిపల్లి వరకు దాదాపు ఒకటిన్నర కిలోమీటర్ల దూరం మేరకు భూములు సాగులోకి వచ్చేవి. ఇవి కాకుండా వజ్రాల వంక డ్యాం పరిసరాల్లో భూగర్భ జలాలు పెరిగి వ్యవసాయ బావుల్లోనూ నీరు ఆశాజనకంగా అందుబాటులో ఉండేవి. మెట్ట ప్రాంతం భూములు కూడా సాగులోకి వచ్చేవి. ఆప్రాంత రైతన్నలు అన్నానికి కొదవ లేకుండా జీవనం సాగిస్తూ వచ్చారు. ఈ పరిస్థితుల్లో ఆరేళ్ళ క్రితం కురిసిన వర్షాలకు వజ్రాల వంకలో నీటి ఉధృతి పెరిగడంతో డ్యాం మొరవ నుంచి నీరు అధికంగా పారడంతో డ్యాంకు కుడి, ఎడమ కాలువలు దెబ్బతిని నీరు పూర్తిగా వజ్రాల వంక ద్వారా బాహుదానదిలో చేరి వృథా అవుతున్నాయి. దిగువ ప్రాంతంలోని రెండు కుంటలు, సుమారు 900 ఎకరాల సాగు భూమి బీడుగా మారింది.



వజ్రాల వంకలో నిండుగా ఉన్న నీరు

వరద నీటిని ఒడిసి పట్టడంలో దిట్ట 'కిచ్చిలి'

వజ్రాల వంక వరద నీటిని ఒడిసి పట్టి వాటిని భూమిలో దాచి పెట్టడంలో దిట్ట అనిపించుకున్నాడు అప్పటి సాగు నీటి సంఘం అధ్యక్షుడు కిచ్చిలి జయరాంరెడ్డి. అక్కడ ఆయన నీటి వృథాను నియంత్రిస్తూ, దిగువ ప్రాంతాల్లోని చవటకుంట, రంగారెడ్డి కుంటలకు నీరు మళ్లించడంలో కీలకంగా వ్యవహరించేవారు. వజ్రాల వంక ప్రాజెక్ట్ నిర్మాణం పనులు పూర్తయ్యాక కూడా ఆయన దాదాపు 20 ఏళ్ల పాటు సాగు నీటి సంఘం చైర్మన్‌గా వ్యవహరించారు. ప్రాజెక్ట్‌లోని చుక్క నీరు కూడా వృథా కాకుండా చర్యలు తీసుకుంటూ మల్లారపువాండ్లపల్లి, మిరియాల వాండ్లపల్లి, కొత్తకురవపల్లి, కొత్తవడ్డిపల్లి, రాచపల్లి వారిపల్లి, ముళ్లగోరివారిపల్లి, సర్వోదయ నగర్, ఎర్రగొండక్కగారిపల్లికి చెందిన రైతన్నల నీటి అవసరాలను తీరుస్తూ వారికి తల్లో నాలుకలా వ్యవహరించేవారు.

వంకకు పూర్వ వైభవం తెస్తా

వజ్రాల వంక పూర్వ సాగునీటి సంఘం అధ్యక్షులు కిచ్చిలి జయరాంరెడ్డి తనయుడిగా తాను స్థానిక ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి సహకారంతో వజ్రాల వంకకు పూర్వ వైభవం సాధించడానికి తన వంతు కృషి చేసి ఈ ప్రాంత అన్నదాతల కళ్ళల్లో ఆనందాన్ని నింపడమే తన కర్తవ్యంగా భావించి రిపేర్స్, రీస్టోరేషన్, రెనోవేషన్ (ఆర్‌ఆర్‌ఆర్) పథకం ద్వారా అభివృద్ధి చేయడానికి ప్రతిపాదనలు పంపినట్లు కిచ్చిలి వెంకట రమణారెడ్డి తెలిపారు.



కేక్ కట్ చేస్తున్న మన్సూర్ అలీఖాన్

ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం

- డిసిసి మైనార్టీ చైర్మన్ మన్సూర్ అలీఖాన్

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

రాబోయే ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని డిసిసి మైనార్టీ చైర్మన్ మన్సూర్ అలీఖాన్ అన్నారు. ఎఐసిసి అధ్యక్షులుగా మల్లికార్జున ఖర్గే పదవి బాధ్యతలు స్వీకరించి నేటికీ సంవత్సరం పూర్తయిన సందర్భంగా శుక్రవారం మైనార్టీ శ్రేణులతో కలిసి కేక్‌కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే 2024 సంవత్సరంలో సోనియా గాంధీ నేతృత్వంలో, ఖర్గే సారథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఇంకా ఎన్నో విజయాలు సాధిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. మధ్యప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్‌ఘడ్, మిజోరం రాష్ట్రాలలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ పట్టణ అధ్యక్షులు దర్బార్ భాష, జిల్లా మైనార్టీ సెక్రెటరీ యహియా బాషా, కార్యకర్తలు హబీబ్, జిలాన్, అషరఫ్ పాల్గొన్నారు.



ఆర్‌బికెలో ఇ-పంట నమోదు జాబితాను ప్రదర్శిస్తున్న వ్యవసాయ అధికారులు

ఆర్‌బికెలో ఇ-పంట నమోదు జాబితా

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మండలంలోని రైతు భరోసా కేంద్రాలలో ఇ-పంట నమోదు జాబితాను ప్రదర్శించినట్లు మండల వ్యవసాయ అధికారి మురళీమోహన్ తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ ఈ సంవత్సరం ఖరీఫ్ సీజన్ లో రైతులుసాగు చేసిన వివిధ రకాల పంటల వివరాలను ఇ-పంటలో నమోదు చేశామన్నారు. ఖరీఫ్ సీజన్‌లో మండలంలోని 12 సచివాలయాల పరిధిలో 2483 మంది రైతులు 5151.12 ఎకరాల విస్తీర్ణంలో వ్యవసాయ, ఉద్యానవన పంటలను సాగు చేసినట్లు వివరించారు. ఆయా సచివాలయాల పరిధిలో ఇ-పంటలో నమోదు చేసిన రైతుల వివరాలను, పంటల వివరాలను తెలిపే జాబితాను ప్రదర్శించినట్లు తెలిపారు. ఈ జాబితాపై రైతులకు ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే మార్పులు చేర్పులకై ఈనెల 29 లోపు వ్యవసాయ అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. తుది జాబితాను ఈనెల 31వ తేదీ ఆర్‌బికె కేంద్రాల వద్ద ప్రదర్శిస్తామన్నారు. ప్రభుత్వం రైతులకు అందిస్తున్న అన్ని పథకాలకు ఇ-పంట ఆధారమన్నారు. రైతులు ఈ విషయాన్ని గమనించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎఇఒ లక్ష్మీ ప్రసన్న, విఆర్ఒ రామకృష్ణ, నాయకులు శంకర, గంగాధర, రవి, పాల్గొన్నారు.

టమోటా పంటను ధ్వంసం చేసిన అడవి పందులు

ప్రజాశక్తి-రామాపురం

ఎంతో కష్టించి సాగుచేసుకున్న టమోటా పంటన చేతికందే సమయానికి అడవి పందులు ధ్వంసం చేశాయని మండలంలోని నల్లగుట్టపల్లి పంచాయతీ కర్ణపువాండ్లపల్లెకు చెందినవంగిమల్ల భాస్కర్‌రెడ్డి అనే ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ రహదారికి ప్రక్కగా పంట పొలంలో ఎకరా టమోటా పంట సాగు చేసినట్లు తెలిపారు. పంట కోతకొచ్చే సమయంలో అడవి పందులు ఉన్నఫలంగా పంటపై పడి విచ్చలవిడిగా పంటను నాశనం చేశాయని వాపోయారు. సుమారు రూ.50వేలు ఖర్చుచేసి టమోటా సాగుకు ఖర్చు చేశానన్నారు. ఉద్యానవనశాఖ అధికారులు పరిశీలించి ఆదుకోవాలని కోరారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని అర్బన్ ఎస్ఐ నరసింహారెడ్డి పేర్కొన్నారు. రాయచోటి డివిజన్ డిఎస్‌పి మహబూబ్ బాషా, అర్బన్ సిఐ సుధాకర్‌రెడ్డి ఉత్తర్వుల మేరకు రాయచోటి పట్టణం చెక్‌పోస్ట్ శివాలయం వద్ద ఎఎస్ఐ జోసెఫ్,హెడ్ కానిస్టేబుల్ ఎవి రమణ, పోలీసు సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ద్విచక్ర వాహనాలతో పాటు ఆటోలు, కార్లు రికార్డులను పరిశీలించారు. రికార్డులు సరిగా లేని వాహనదారులకు జరిమనాలు విధించి రికార్డులను క్రమబద్ధికరించుకోవాలని వారికి సూచించారు. మత్తు పానీయాలు సేవించి నడిపిన వాహనదారులకు పోలీసు చట్టం ప్రకారం జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు వాహనదారులకు బాధ్యత రహితం లేకపోవడమే ప్రమాదాలకు కారణమన్నారు. మద్యం సేవించి విచ్చలవిడిగా రోడ్డుపై వాహనాల నడపడం వల్లే అధికంగా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ కూడా హెల్మెట్ ధరించాలని వారు సూచించారు.

ప్రమాదాల నివారణకు బారికేడ్లు ఏర్పాటు

ప్రజాశక్తి-కలకడ

ప్రమాదాల నివారణకు బారికేడ్లు ఏర్పాటు చేసినట్లు కలకడ సర్కిల్ సిఐ నాగేంద్ర పేర్కొన్నారు. మండలంలో పలు రకాలుగా ప్రమాదాలు జరుగుతూ పలువురు ప్రాణాలు పోగొట్టుకున్నట్లు గుర్తించి బారికేడ్లు ఏర్పాటు చేసి ప్రమాదాలు నియంత్రణ చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. మండలంలో ఎక్కడ ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి అక్కడ బారికేడ్లును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిపై తరచుగా ప్రమాదాలు జరుగుతుండడంతో కలకడ సర్కిల్ పరిధిలో ఉన్న కలకడ, కె.వి పల్లి మండల పరిధిలో బారికేడ్లను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన సూచించారు. ఈ బ్యారికేడ్ల తయారీకి సహకరించి ముందుకు వచ్చిన టమోటా మార్కెట్ యజమానులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ తిప్పేస్వామి, ఎఎస్ఐ బాలకృష్ణ,హెడ్ కానిస్టేబుల్స్ హరిబాబు, రమేష్ కుమార్, సునీల్ శశి కుమార్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.**పుల్లంపేట :** ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ రఘురాం వాహనదారులకు సూచించారు. మండలంలోని చిన్నంపల్లి క్రాస్ వద్ద పర్యటించి వాహనదారులకు కొన్ని సలహాలు సూచనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు ప్రమాదాలు నివారించుకోవాలంటే హెల్మెంట్ ధరించాలని పేర్కొన్నారు.

ఘనంగా నియాజ్ షరీఫ్

ప్రజాశక్తి-ములకలచెరువు

పిటిఎం మండలంలోని మద్దయ్యగారిపల్లిలో హజరత్ మహబూబె సుబహాని వారి నియాజ్ షరీఫ్ ఘనంగా మతగురువులు మహమ్మద్ ముఖ్‌తార్‌షా ఖాదిరి అధ్వర్యంలొ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఖానిఖాఎ ఫైజానె హాషిమి ఆశ్రమంలోని మహబూబె సుబహానివారి నషానె ముబారక్‌లో గంధోత్స వం నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టి, మహబూబె సుబహాని వారి జీవిత చరిత్ర గురంచి తెలిపారు. కార్యక్ర మంలో మతగురువులతో పాటు హిందూ ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

'మిట్స్'ను సందర్శించిన ప్రొఫెసర్ సెడ్రిక్ బోర్నాండ్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె సమీపంలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల కు స్విట్జర్లాండ్ లోని హెచ్ఇజివిడి ఇన్స్టిట్యూషన్ లోని రీకాన్ఫిగరబుల్ ఎంబెడెడ్ డిజిటల్ సిస్టమ్స్ (ఆర్ఇడిఎస్) ఇన్స్టిట్యూట్ ప్రొఫెసర్ సెడ్రిక్ బోర్నాండ్ సందర్శించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ అన్నారు. కళాశాలలో ఏర్పాటు చేసిన అధ్యాపకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఎంబెడెడ్ సిస్టంలో జరుగుతున్న పరిశోధనల గురుంచి వివరించారని అన్నారు. ఆయన మాట్లాడుతూ మనకు ఎంబెడెడ్ సిస్టం నందు అనేక పరిశోధనలతో రోజు రోజు కు టెక్నాలజీ మెరుగుపడుతున్నదన్నారు. ప్రపంచం మరింత డిజిటల్‌గా, కనెక్ట్ చేయబడి, ఆటోమేటెడ్‌గా మారుతోందని, అయితే ఇది సాధ్యమయ్యేది ఎంబెడెడ్ సిస్టమ్స్ ద్వారా నే నని అన్నారు. కార్యక్రమం లో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్, డీన్ గౌతమ్ చక్రబర్తి, సీనియర్ మేనేజర్ విజయ లక్ష్మి పాల్గొన్నారు.

ప్రజా రక్షణభేరిని జయప్రదం చేయండి

-సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు

ప్రజాశక్తి-రైల్వే కోడూరు

అసమానతలులేనిఅభివృద్ధి, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం సిపిఎం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రజారక్షణభేరి బస్సుజాతాను, బహిరంగసభలను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు పిలుపునిచ్చారు. శుక్రవారం సిపిఐటి కార్యాలయంలో సుబ్బరామయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీనివాసులు మాట్లాడుతూ అసమానతలు లేని అభివృద్ధి కోసం సిపిఎం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా మూడు బస్సు జాతలునిర్వహిస్తున్నదని, అందులోభాగంగా 30న కర్నూలు జిల్లా నుంచి బయలు దేరి 3న నాలుగు గంటలకు మదనపల్లికి చేరుకుంటుంది అన్నారు. ఈసందర్భంగా నిర్వహించే బహిరంగ సభలను జయప్రదం చేయాలనిపిలుపునిచ్చారు. ఈ బహిరంగ సభలకు, సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు, మాజీ శాసనసభ్యులు, ఎంఎగఫూర్, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, వెంకటేశ్వర్లు, ప్రభాకర్‌రెడ్డి, రాంభూపాల్ హాజర వుతారని తెలిపారు. దేశంలో రాష్ట్రంలో నెలకొని ఉన్న పరిస్థితులు కలవర పరుస్తున్నాయని ప్రజలందరూ ఐక్యంగా ఉద్యమించవలసిన కాలం వచ్చింది, భాగస్వాములు కావాలనికోరారు. రాష్ట్రానికి విభజన చట్టంలో పొందుపరిచిన హామీలు ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్ట్, కడప ఉక్కు ఫ్యాక్టరీ లాంటి విభజన హామీలను ఏ ఒక్కటి అమలు చేయలేదన్నారు. రాష్ట్ర ప్రజలను నిలువుగా మోసం చేసిన బిజెపి అంతటితో ఆగకుండా రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధికి గుండెకాయ లాంటిది విశాఖ ఉక్కును అమ్మేందుకు సిద్ధమైందన్నారు.



ప్రజా రక్షణభేరి కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు, సిహెచ్ చంద్రశేఖర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీలకు ఆశాలకు, గ్రామ సేవకులు, విద్యుత్, పంచాయతీ మున్సిపాలిటీ, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు చేసిన వాగ్దానాన్ని గాలికి ఎగిరిపోయాయి అన్నారు. లౌకికరాజ్యాంగం పరిరక్షణ కోసం, జిల్లా రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం పోరాడాలని,గతంలో చేసిన ఉద్యమాల ఫలితంగా అనేక ఫలితాలు సాధించామన్నారు.అనంతరం పోస్టర్ విడుదల చేశారు. మళ్లీ మరో మహోద్యమం కోసం ప్రజారక్షణ బేరి జాతనుబహిరంగ సభలను జయప్రదం చేయాలన్నారు. సమావేశంలో కోడూరు సిపిఎం శాఖ కార్యదర్శి లింగాల యానాదయ్య, కమిటీ సభ్యులు కర్రతోటి హరి నారాయణ, పి జాన్‌ప్రసాద్, బొజ్జ శివయ్య, పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో మెరుగైన వైద్య సేవలు : ఎమ్మెల్యే



మదనపల్లి :సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

జగనన్న సురక్షతో మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయని, ప్రజారోగ్యానికి సిఎం జగన్ పెద్దపీట వేస్తున్నారని ఎమ్మెల్యే నవాజ్‌బాషా పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని స్థానిక పెంచుపాడు రోడ్డు, రవీంద్రనాథ్‌ఠాగూర్, పాఠశాల వద్ద జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమం 15 వార్డు కౌన్సిలర్ పాకాల శంకరమ్మ హరిల ఆధ్వర్యంలో జరిగింది.ఈ కార్యక్రమనికి ముఖ్యఅతిధిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజల ఇంటి వద్దకే వైద్యం అందుతుందన్నారు. పట్టణాలు, గ్రామాలలో ప్రతి ఇంటికి వెళ్లి అనారోగ్యంతో ఉన్నవారిని గుర్తించి వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతిపక్ష నాయకుల మాటలు విని మోసపోవద్దని ప్రజలకు సూచించారు. రాష్ట్రానికి మంచి చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో మరోమారు గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్, ఎఇ శిరీష, కౌన్సిలర్లు పి.రాజేష్, ఈశ్వర్ నాయక్, ఎస్.వి.రమణ, వెంకట శివారెడ్డి, శ్రీనివాసులు, రహీం, భాను ప్రకాష్, రేణుకమ్మ, కో-ఆప్షన్ మెంబర్ శారదమ్మ,క్రిస్టియన్ సెల్ జిల్లా అధ్యక్షులు జాన్ బాబు,వైఎస్సార్ సీపీ కార్మిక విభాగం షరీఫ్, జెసిఎన్ ఇన్‌ఛార్జి బావాజాన్, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు .**కలికిరి :**స్థానిక మండలంలోని అద్దవారిపల్లి గ్రామపం చాయతీలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించినట్లు ఎంపిడిఒ గంగయ్య యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు వ్యాధి గ్రస్తులకు దాదాపు 150 మందికి ఏడు రకాల ఉచిత పరీక్షలు నిర్వహించి దానికి సంబంధించిన చికిత్సలు చేయించి మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ముస్లిం మైనార్టీ కమిషన్ చైర్మన్ ఇక్బాల్ అహ్మద్ మాట్లాడుతూ పేద ప్రజలు వ్యాధిగ్రస్తులు ఎక్కడో ఆస్పత్రికి వెళ్లి సుదూర ప్రాంతాల్లో అధిక ఖర్చులు వెచ్చించి వ్యాధి నిర్ధారణ కొరకు కొన్ని వేల రూపాయలు ఖర్చు పెట్టాల్సిన అవసరం లేకుండా ఇంటి వద్దకే వైద్యం అందించడం గొప్ప వరమన్నారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి పద్మజా, లోకవర్ధన్, ఎంపిపి వేంపల్లి నూర్జహాన్ సర్పంచ్ గంగయ్య, మాజీ సహకార బ్యాంకు చైర్మన్ తిమ్మారెడ్డి, సహకార బ్యాంకు చైర్మన్ శ్రీకర్ రెడ్డి, వైద్యులు, వాలంటీర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం :'చింతల'

ప్రజాశక్తి-కలకడ

సమస్యల పరిష్కారం కోసమే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని బాలయ్యగారిపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న పలు గ్రామాలలో బాకీ మాని వడ్డిపల్లి, బాలయ్యగారిపల్లి, హరిజనవాడ, ఎస్‌సికాలనీ, చర్చి వీధి ,ఎరుకల కాలనీ లలో గడపగడపకు కార్యక్రమంలో ఆయన పర్యటించారు. ముఖ్యమంత్రి అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ప్రజల అవసరాలను బట్టి పైప్ లైన్, సింటెక్స్, గృహాలు మంజూరు చేయడం చేసినట్లు తెలిపారు. నవరత్నాలతో పేదలపాలిట వరమని అన్నారు. సంక్షేమ పాలన కోసం వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో మరల వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేయాలని కోరారు.ఈ కార్యక్ర మంలో ఎంపిపి శ్రీదేవిరవికుమార్, సింగిల్ విండో ప్రెసిడెంట్ వెంకట రమణారెడ్డి పార్టీ, కన్వీనర్ కమలాకర్‌రెడ్డి, వైసిపి సావత్ అలీఖాన్, ఆర్ వెంకటరమణ, రవికుమార్, ప్రకాష్ రెడ్డి, కుమార్ రెడ్డి, నాయకులు మండల స్థాయి అధికారులు, సెక్రటరీ షబానాబాను సచివాల సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజా సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

ఉర్దూ ఉపాధ్యాయురాలిని నియమించండి

ప్రజాశక్తి- చిట్వేలు

మండల పరిధిలోని స్థానిక పురాతన మసీదులో శుక్రవారం జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్‌అహ్మద్ ఖాన్ మైనారిటీ సోదరులతో కలిసి నమాజ్ లో పాల్గొన్నారు. అనంతరం ముస్లిం మైనారిటీ సోదరులు గత రెండు సంవత్సరాలుగా మండలంలో ఉర్దూ ఉపాధ్యాయురాలు లేక ఉర్దూ పాఠశాల మూతపడడంపై జెసికి వినతి పత్రం అందించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా ఉర్దూ పాఠశాల మహిళలకు ఎంతగానో ఉపయోగపడుతూ ఉండేదని గత రెండు సంవత్సరాలుగా ఉర్దూ ఉపాధ్యాయురాలు లేక మధ్యలోనే చదువు ఆగిపోవడమే గాక పాఠశాల కూడా మూతపడడం, ఎన్నోసార్లు ఉపాధ్యాయురాలు కోసం వినతి పత్రాలు ఇచ్చిన ప్రయోజనం లేకపో యిందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం ఈ సమస్యకు పరిష్కారం చూపి ఉర్దూ పాఠశాలకు ఉపాధ్యా యురాలని నియామకం చేయాలని వారు కోరారు.

టపాకాయల దుకాణాల ఏర్పాటుకు స్థల పరిశీలన

ప్రజాశక్తి-పీలేరు

పట్టణంలో దీపావళి సందర్భంగా టపాకాయల విక్రయానికి దుకాణాల ఏర్పాటుకు అధికారులు స్థల పరిశీలన చేశారు. ఇందుకోసం శుక్రవారం స్థానిక మార్కెట్ యార్డ్ ఆవరణం, బొడుమల్లువారిపల్లి సమీపంలోని జాతీయ రహదారి ప్రక్కన స్థలాలను రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక దళం, విద్యుత్ శాఖ అధికారులు పరిశీలిం చారు. ఈ సందర్భంగా తహశీల్దార్ కె. ధనుంజయులు మాట్లాడుతూ పట్టణంలో టపాకాయల విక్రయానికి 16 దుకాణాలకు అనుమతి ఇచ్చామని అన్నారు. స్థానిక మార్కెట్ యార్డ్ ఆవరణలో 14 దుకాణాలకు, బొడుమల్లువారిపల్లి సమీపంలోని జాతీయ రహదారి ప్రక్కన 2 దుకాణాలకు అనుమతి ఇచ్చినట్లు చెప్పారు. అనంతరం టపాకాయల దుకాణదారులతో మాట్లాడుతూ వ్యాపారులు దుకాణానికి, దుకాణానికి మధ్య మూడు మీటర్ల దూరం ఉండాలని, దుకాణాలన్నీ 'ఎల్' ఆకారములో ఉండాలని, అగ్నిమాపక, విద్యుత్ శాఖకు సంబంధించి అన్ని జాగ్రత్తలు కచ్చితంగా పాటించి దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్ర మంలోఅర్బన్ సిఐ ఎన్. మోహన్ రెడ్డి, విద్యుత్ శాఖ ఎఇ పురుషోత్తం, రాజంపేట ఎంపిపిఆర్ఒ ఉదయ్ కుమార్, కాగితి ఆనంద్, బుక్ షాప్ సంజీ వయ్య, విఆర్ఒలు సి.యర్రయ్య, డి. వెంకటరమణ, శిల్ప, కవిత, సర్వేయర్ రెడ్డెప్ప, పిసి కె. విజయకుమార్, టపాకాయల దుకాణ దారులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి చదువుకోవాలి : డిఎల్‌డిఒ

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండి చదువుకోవాలని మదనపల్లి డివిజనల్ లెవెల్ డెవలప్మెంట్ ఆఫీసర్ లక్ష్మీపతి అన్నారు. శుక్రవారం బండ్లపై, రెడ్డివారిపల్లి గ్రామాలలో ఆయన పర్యటించారు. గ్రామాల్లోని విద్యార్థుల తల్లిదండ్రులకు, మహిళలకు విద్య ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. పిల్లలు చదువుకునే వయ సులో బడికి వెళ్లి బాగా చదువుకోవాలని, చదువు ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడికి వెళ్లకుండా చదువు మధ్యలో నిలిపివేసిన విద్యార్థులను గుర్తించి, బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రతి విద్యార్థి చదువుకొని, భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదిగేలా ప్రోత్సహించాలని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య విద్యా ర్థులకు అందుతున్నాదని, విద్యతో పాటు మధ్యాహ్న భోజనం పథకం ద్వారా పోషణ కలిగిన ఆహారాన్ని విద్యా ర్థులకు అందిస్తున్నట్లు తెలిపారు. చదువే భవిష్యత్తుకు ఆధారమని అన్నారు. అనంతరం రెడ్డివారిపల్లెలో బాల్య వివాహాలపై మహిళలకు, ప్రజలకు అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం అన్నారు. బాల్య వివాహాలపై అధికారులకు తక్షణం సమాచారం అందించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శేషగిరిరావు, ఎంఇఒ పద్మావతి, పంచాయతీ కార్య దర్శిలు మారప్ప, ఎర్రమల్లయ్య నాయుడు పాల్గొన్నారు.

ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు క్షమాపణలు చెప్పాలి

- టిడిపి పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్మోహన్‌రాజు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు క్షమాపణ చెప్పిన తర్వాతే వైసిపి సామాజిక సాధికార యాత్రకు రావాలని టిడిపి పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్ మోహన్ రాజు డిమాండ్ చేశారు. శుక్రవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నా ఎస్‌టి, ఎస్‌సి, బిసిలంటూ పాట పాడే సిఎం జగన్ వారి అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన సబ్ ప్లాన్ నిధులు రూ.1.20 లక్షల కోట్లు దారి మళ్లించడం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. వైసిపి సామాజిక సాధికార యాత్ర ఎవరిని మోసం చేసేందుకు అని ఆయన ప్రశ్నించారు. భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ పేరుతో విదేశీ విద్య పథకం ప్రవేశపెడితే దానిని జగనన్న విదేశీ విద్య అని పేరు మార్చడం ఘోర తప్పిదమన్నారు. ఇది తుగ్లక్ చర్య అని మండిపడ్డారు. రాజ్యాంగ నిర్మాత పేరు మార్చి పెట్టుకునే స్థాయి జగన్ రెడ్డికి ఉందా అని అన్నారు. బిసిల కష్టాలు ఇప్పుడైనా గుర్తుకొచ్చాయని బస్సు యాత్రలతో ప్రజల ముందుకు రావడం విడ్డూరంగా ఉందన్నారు. బిసిలను విభజించి పాలించే సిద్ధాంతాలతో విభేదాలు సృష్టించి పబ్బం గడుపుకునేందుకే కార్పొరేషన్లుగా మార్చి వైసిపి నాయకులకు పదవులు పంచి బిసిలను వంచించారని మండిపడ్డారు.తెలుగుదేశం పార్టీ హయాంలో బిసిల అభ్యున్నతికి కేటాయించిన నిధులను, వైసిపి హయాంలో బిసిల కోసం మంజూరు చేసిన నిధులను బడ్జెట్‌లో పరిశీలిస్తే బిసిలపై జగన్‌కు ఎంత ప్రేమ ఉందో స్పష్టమవుతుందన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి గెలుపు తథ్యమని, వైసిపికి రోజులు దగ్గరపడ్డాయని అన్నారు. ప్రజలు చంద్రబాబు నాయకత్వాన్ని కోరుకుంటున్నారని అన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలు ఇప్పటికే వైసిపి పాలనపై విసుగు చెందాని అన్నారు. టిడిపి పాలన కోసం ఎదురు చూస్తున్నాని అన్నారు. చంద్రబాబుతోనే సంక్షేమ పాలన అందుతుందన్నారు. కార్యక్రమంలో పార్లమెంట్ కార్య నిర్వాహక కార్యదర్శి కోవూరు సుబ్రహ్మణ్యం నాయుడు, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు సుబ్బనరసయ్య నాయుడు, సర్పంచ్ కోటయ్య నాయుడు, మండల పార్టీ ఉపాధ్యక్షులు సతీష్ రాజు, సిద్ధవటం మాజీ జెడ్పిటిసి చలమయ్య యాదవ్, సూర్యనారాయణరాజు, తులసినాగేంద్ర, రామ్మోహన్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చమర్తి జగన్మోహన్‌రాజు



ప్రజలతో మాట్లాడుతున్న డిఎస్‌పి కేశప్ప

నక్కలదిన్నెతాండలో నాకాబందీ

రికార్డులు లేని వాహనాలు స్వాధీనం : డిఎస్‌పి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె పట్టణం 25వ వార్డులో శుక్రవారం నక్కలదిన్నె తాండలో డిఎస్‌పి కేశప్ప ఆద్వర్యంలో ఎస్ఇబితో కలసి సంయుక్తంగా పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. వార్డు కౌన్సిలర్ ఈశ్వర్ నాయక్ సహకారాన్ని డిఎస్‌పి అభినందించారు. ప్రజల్లో గడిచిన ఏడాది కాలంలో చాలా మార్పు వచ్చిందని కితాబునిచ్చారు. నాటుసారా అమ్మకాలపైన నిఘా ఉంచడంతో పాటు, రికార్డులు లేని వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అంతేకాకుండా వ్యభిచారం జరుగుతోందని వస్తున్న సమాచారంపైన ఆరా తీశారు. ఎక్కడైనా తాండాలలో అక్రమంగా సారా అమ్మకాలు, తయారీ జరిగినా చట్టపరంగా చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. గడిచిన తొమ్మిదినెలల కాలంలో ఎనిమిది సార్లు తనిఖీలు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో తాలూకా సిఐ సత్యనారాయణ, ఎస్ఐలు హరిహరప్రసాద్, గాయత్రి,లోకేష్ రెడ్డి, రామాంజనేయులు, రవీంద్ర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సుబ్బారెడ్డి

సామాజిక సాధికార యాత్రను దిగ్విజయం చేయండి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలను, ఆయన ప్రవేశపెట్టిన వివిధ సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి వెళ్లి వివరించి, నవంబర్ 9న నియోజకవర్గంలో జరిగే సామాజిక సాధికార యాత్రను దిగ్విజయం చేయాల్సిన బాధ్యత మన అందరిపైన ఉందని తంబళ్లపల్లి నియోజకవర్గ వైసిపి సలహాదారు సుబ్బారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండలంలోని సర్పంచులు, ఎంపిటిసిలు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడు ఖలీల్‌అహ్మద్ మాట్లాడుతూ అర్హులైన వారికి సంక్షేమం పథకాలు అందేవిదంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా మహిళా అధ్యక్షులు అనిత చక్రవర్తి, నాయకులు ప్రదీప్‌రెడ్డి, ఆర్.చిన్నికృష్ణ, కంచి కల్యాణ్‌రెడ్డిలు పాల్గొన్నారు.

పేద విద్యార్థికి ల్యాప్‌టాప్ వితరణ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

వెలుగు ప్రత్యేక పాఠశాల ఆవరణంలో వెలుగు సెక్రటరీ యం.ఉదయ్ మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. అంగళ్ల విశ్వం కళాశాలలలో డిగ్రీ పూర్తి చేసిన పేదవిద్యార్థి పి.భవాని ప్రతిభను గుర్తించి ఉచితంగా ల్యాప్‌టాప్‌ను అందించారు. బధిరులకు ఉచితంగా హియరింగ్ హెడ్స్‌ను, మదనపల్లిలో ధాత్రి ఫౌండేషన్‌కు లెర్నింగ్ కిట్లను ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన జన్మదిన వేడుకలను పునస్కరించుకొని సేవా కార్యక్రమం చేయడం తనకెంతో ఆనందదాయకంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో సోదరుడు యం.ఉదయ్ కుమార్‌రెడ్డి, కుటుంబ సభ్యులు, స్నేహితులు, వెలుగు కన్వీనర్ ఆర్.భాగ్యలక్ష్మి, ప్రిన్సిపల్ పి.లీనాకుమారి, సోషల్ వర్కర్ యం.గీత,వెలుగు సిబ్బంది, చిన్నారులు, వృద్దులు పాల్గొన్నారు.

తప్పుల్లేని ఓటర్ల జాబితా అందించాలి

ప్రజాశక్తి-పుల్లంపేట

ఓటరు తన ఓటు హక్కును సజావుగా సద్వినియోగం చేసుకునేందుకు వీలుగా తప్పులు లేని ఓటర్ల జాబితా అందించడం మన కర్తవ్యంగా భావించాలని తహశీల్దార్ నరసింహకుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో మండలంలోని బిఎల్‌ఒలతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ 2024లో జరిగే సార్వత్రిక ఎన్నికల కోసం తప్పుల్లేని ఓటర్ల జాబితాను అందించడం కోసం సమిష్టి కృషి చేద్దామని చెప్పారు. డిసెంబర్ 9లోగా సంబంధించిన క్లైమ్లను బిఎల్‌ఓల ద్వారా సేకరించి ఓటర్ల జాబితాలో ఏవైనా తప్పులుంటే వాటిని సరిదిద్దాలని ఆదేశించారు. ప్రతి బిఎల్‌ఒ డోర్ టు డోర్ తిరిగి ఇంటి నెంబర్ పరిశీలించి జాబితాలో పొందుపరచాలని తెలిపారు. కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ నవీన్ మరియు రెవెన్యూ సిబ్బంది,బిఎల్‌ఒలు పాల్గొన్నారు.

ఎల్లంకివారిపల్లెలో తాగునీటి కష్టాలు

ప్రజాశక్తి-కలకడ

ఎల్లంకివారిపల్లెలో నీటి కష్టాలు తలెత్తినట్లు గ్రామస్తులు వాపోతున్నారు. మండలంలోని ఎర్రకోట పల్లి పంచాయతీ ఎల్లంకి వారి పల్లెలో సుమారు 50 కుటుంబాలు నివాసముంటున్నారు. ఈ గ్రామంలో ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు కారణంగా నీటి కొరత సంబంధించి నీటి కష్టాలు మొదలైనట్లు గ్రామస్తులు వాపోయారు. నీటికష్టాలు గ్రామంలో తాండవిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులకు తెలిపినా పట్టించుకున్న పాపాన్ని పోలేదని గ్రామస్తులు వాపోయారు. ఈ గ్రామంలో నీటి కోసం స్థానిక వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్న పరిస్థితులు తాండవిస్తున్నట్లు గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. తాగునీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన చెందారు. ఇప్పటికైనా అధికారులు స్పందించిన నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

క్రైం కార్నర్

ద్విచక్ర వాహన ప్రమాదంలో యువకుడి మృతి

ప్రజాశక్తి-నిమ్మనపల్లి



గజేంద్ర(ఫైల్ ఫొటో)

ద్విచక్ర వాహన ప్రమాదంలో యువకుడి గాయపడి, చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటనపై స్థానిక హెడ్‌కానిస్టేబుల్ ఎం.శివరా మకృష్ణయ్య కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల మేరకు..మండల పరిధిలోని ముష్టూరు పంచాయతీ గౌనిగా రిపల్లెకు చెందిన కొండ సముద్రం వెంకటరమణ కుమారుడు కె.గజేంద్ర(22) ద్విచక్ర వాహనంలో ఈనెల 25న రాత్రి దిగువపల్లిలోని గుడి వద్దకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా ద్విచక్ర వాహనం అదుపుతప్పి గౌనిగారిపల్లి సమీపంలోని కల్వర్టును ఢీకొని రోడ్డు ప్రక్కన ఉన్న పొలాలలో పడినట్లు తెలిపారు. సంఘటన సమాచారం గ్రామ సర్పంచ్ చంద్రాయుడుకు అందగా తన కుటుంబ సభ్యులకు తెలియజేసి, గ్రామస్తులతో సంఘటన స్థలానికి వెళ్లి చూడగా యువకుడు అపస్మారస్థితిలో ఉన్నట్లు తెలిపారు. తీవ్ర గాయాలతో ఉన్న గజేంద్రను 108 వాహనంలో మదనపల్లి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలిస్తుండగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. ఈ సంఘ టనపై గౌనిగారిపల్లికి చెందిన ఎన్.లక్ష్మన్న పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.